క్లుప్తంగా

చిరు వ్యాపారులకు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిరువ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా వారు వ్యాపార అభివృద్ధి కోసం బండ్లను తన సొంత డబ్బులతో తయారు చేయించి అందజేస్తున్నారు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి. శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే అందజేసిన బండ్లను అందజేశారు. దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నరేంద్రకు రిక్షాబండిని, షేక్ సాబీరకు టిఫిన్ బండి, పెదపాలెం గ్రామానికి చెందిన జన్ను శ్రీనివాస్ గౌడ్, బుల్లా కాటయ్య, యల్లమాటి ప్రసాద్‌లకు తోపుడు బండ్లుని అవసరమని స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించిన ఆయన వారికి అవసరమైన బండ్లను తయారు చేయించి అందజేశారని తెలిపారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయంతో తాడేపల్లి పట్టణ పరిధిలో నాలుగు ఇస్త్రీ బండ్లు, రెండు ప్లాట్‌ఫామ్ బండ్లను శనివారం వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్, నులకపేట, ముగ్గురోడ్డు, తాడేపల్లి ప్రాంతాల్లో నివాసముంటూ ఇంటింటికి తిరిగి బట్టలు సేకరించి ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రజకులకు నాలుగు ఇస్త్రీ బండ్లు, అద్దె బండ్లపై వ్యాపారం చేసుకునే ఇద్దరికి ప్లాట్‌ఫామ్ బండ్లు అవసరమని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లామని, స్పందించిన ఆయన వెంటనే తన సొంత నిధులతో వాటిని తయారు చేయించి అందజేశారని తెలిపారు.

రెండు గ్రామాల్లో పొలంబడి



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పెరికలపూడి, గొడవర్రు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష రైతులతో మాట్లాడుతూ విత్తన ఎంపికలో, కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భూసార పరీక్ష కోసం మట్టిని ఏ విధంగా సేకరించాలో రైతులకు వివరించారు. ఏఈఓ ఎ. రమేష్ బాబు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు డి.వంశీ, సీహెచ్ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్లాస్‌లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అట్లాస్ పుస్తకాలు, పెన్నులను శనివారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.ఝాన్సీరాణి మాట్లాడుతూ ఈమని ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి సుగ్గుల కాశీ విశ్వేశ్వరరావు గుప్తా తన తండ్రి సుగ్గుల రామమూర్తి జ్ఞాపకార్థం పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు అట్లాస్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు అందజేశారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్.ప్రకాశరావు, వీర రాఘవయ్య, ఎస్.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

తెనాలిరూరల్: దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా చిన్న నాటి స్నేహితులను కలుసుకునేందుకు ఒక చోటికి చేరారు. 34 ఏళ్ల క్రితం స్కూల్లో కలిసి చదువుతున్న రోజుల ఆ పాత మధురాలను గుర్తు చేసుకుని చిన్న పిల్లలయ్యారు. ఉన్నతోద్యోగాల్లో స్థిరపడిన వీరు రోజూ సార్, మేడమ్ అన్న పలకరింపులకు విరామం కల్పిస్తూ చిన్న నాటి మిత్రులతో ఏరా !, ఏంటే అన్న ఆత్మీయ పలకరింపులతో పులకరించారు. ఏం శ్రీను ఏం చేస్తున్నావు.. పిల్లలు ఎంత మంది..ఏం చదువుతున్నారు...నువ్వెలా ఉన్నావ్. అరే భాను నీ సంగతేంట్రా.. అంటూ పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటుంటే ఆ హాలులో సందడి నెలకొంది. తెనాలి మండలం సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలులో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ×ఆత్మీయ కలయిక¤ ఆదివారం జరుపుకున్నారు. ఇందుకు శనివారం సుల్తానాబాద్‌లోని ఓ హోటల్‌ను వేదికగా చేసుకున్నారు. ఆ రోజుల్లో సువిశాలమైన పాఠశాల ఆవరణలో ఎక్కడెక్కడ ఎక్కువ సమయం గడిపేవారు, ఎవరెవరు కలిసి ఉండే వారు వంటి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- డోకిపర్రులో జగనన్న సురక్ష క్యాంపు

మేడికొండూరు: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హెనీక్రిస్టినా మాట్లాడుతూ ప్రజలకు అన్ని ప్రభుత్వ రంగాల్లో ఉన్నసేవలు నేరుగా అందజేసేందుకు సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు నేరుగా మేలు జరిగే వ్యవస్థలపై ప్రతిపక్షాలు బురదజల్లే యత్నం చేస్తున్నాయని, ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రతి కుటుంబానికి కనీస అవసరం అయిన విద్య, వైద్యరంగాలను అభివృద్ధి చేసి ప్రజలకు చేరువచేయడం జరిగిందన్నారు. ఇంకా గ్రామ స్థాయిలో ఎవరికైనా సంక్షేమపథకాలు అందకుంటే వారికి అందేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అర్హులై ఉండి ఇంకా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారి వివరాలు సేకరించి వారికందేలా చూస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం దేశంలో ఎవరూ అందించడం లేదని అన్నారు. ప్రజలకు ఆర్థికసాయం పలు పథకాలు పేరుతో అందించడంలో దేశానికి వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. తాడికొండ నియోజవకర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు చరిత్రలో నిలిచిపోయేవిధంగా సుపరిపాలన అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, గ్రామసర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం, ఎంపీటీసీ నోసిన రామకోటమ్మ, ఉడతా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, కొండెపోగు కోటేశ్వరావు, ఎలీషా, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, చంటి బాజి, ఎంపీడీఓ కె.ప్రభాకరరావు, జేఏసీ కన్వీనర్ అబ్బాస్ , ఏపీఎం విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



డోకిపర్రులో సర్టిఫికెట్ అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కత్తెర సురేష్ కుమార్

విజయవంతంగా 'జగనన్న సురక్ష'..

మంగళగిరి: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. నగర పరిధి రత్నాలచెరువులోని సూర్యనారాయణ నగర్, లక్ష్మీ నృసింహ స్వామి కాలనీ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హనుమంతరావు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగ పర్చుకుని 11 రకాల సర్వీసులను ఉచితంగా పొందాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, సెక్రటరీ రమేష్, గ్రామ అధ్యక్షుడు ఆర్ల బ్రహ్మయ్య, సచివాలయ కన్వీనర్లు కమ్మెల సుబ్బారావు, మందా విజయ్‌బాబు, కృష్ణారావు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవి

డోలాస్‌నగర్‌లో...

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్ 8వ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, కార్పొరేషన్ సెక్రటరీ శ్రీనివాసరావుతో కలిసి అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

తుళ్లూరులో...

తాడికొండ: రాష్ట్రంలో జగనన్న సురక్షా ద్వారా అర్హులందరికీ సమన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. జగనన్న సురక్షా కార్యక్రమంలో భాగంగా తుళ్ళూరులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, పార్టీ గ్రామఅధ్యక్షుడు ఆలోకం సురేష్, కంతేటి చిన వెంకటేశ్వర్లు, చనుమోలు రామారావు, ఎంపీడీఓ బి.శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు అండ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహాయాన్ని ప్రకటించి వారికి తోడుగా నిలిచారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీలు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోరం పూడి గ్రామంలో కిడ్నీ వ్యాధితో కూచిపూడి మరియదాసు, వివిధ అనారోగ్య సమస్యలతో రాచురి ఏసమ్మ, పక్షవాత బాధితుడు గొరికపూడి బుజ్జి, దివ్యాంగుడు రాచూరి మాణిక్యరావు, అనారోగ్య బాధిత వృద్ధురాలు బాడపల్లి మార్తమ్మ, దివ్యాంగుడు తరగపు వెంకటరావులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.60 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారని తెలిపారు. మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీపీఆర్), ఎంపీటీసీ సభ్యుడు కూచిపూడి సురేష్, ఎంపీటీసీ కొండూరు సుమన్, పలుకూరి శామ్యూల్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు దేశానికే సిగ్గుచేటు

మంగళగిరి: మణిపూర్‌లో జరిగిన అమానుష మారణ హోమాన్ని ఖండిస్తూ శనివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అండ్ రైట్స్ కార్యదర్శి కారుమంచి రామారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధా రోడ్డుపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో తెగల మధ్య సయోధ్య కుదిర్చి శాంతిని నెలకొల్పాలన్నారు. మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బొంతపురి రవి ప్రకాష్, నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి రెవ. కేకే రవికుమార్, దర్శి రమేష్, సురేష్‌బాబు, ఎలీషా, పి.సహదేవ్, పి.బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య, జె.కొండయ్య, యూసఫ్, గరికముక్కు డేవిడ్, బేతాళ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

నేడు కొవ్వొత్తుల ర్యాలీ..

మణిపూర్ మారణహోమాన్ని నిరశిస్తూ ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. శనివారం నగరంలోని పార్కు రోడ్డు హోలీలార్డ్ పెంతెకొస్తు చర్చిలో దైవ సేవకుల అత్యవసర సమావేశం జరిగింది. మణిపూర్‌లో రెండు తెగల మధ్య గత 79 రోజులుగా మారణహోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం తగదన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు పి.తిమోతి, కేకే రవి కుమార్, కె.చిన్న భూషణం, వి.శ్యాంసన్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్, ప్రజాసంఘాల నేతలు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో...

తాడేపల్లిరూరల్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను ఆపాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నుంచి వడ్డేశ్వరం జాతీయ రహదారి వరకు విద్యార్థినులతో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ప్రజా నాట్యమండలి, సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధాని మోదీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మైతే, కుకి తెగల మధ్య మొదలైన హింసాకాండ వలన 150మంది హత్యకు గురయ్యారన్నారు. ప్రతిరోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామన్న మాట్లాడుతూ కార్గిల్ పోరాటవీరుడి భార్యను వీడియోలో చూపినట్లుగా వివస్త్రను చేసి, అత్యాచారం అనంతరం హత్య చేసిన సంఘటన యావత్ భారత దేశం తలదించుకునేలా ఉందని అన్నారు. మేధావులు, ప్రజా స్వామిక వాదులు నరేంద్రమోదీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని కోరుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బాలాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్ కుమార్, ఐద్వా నాయకులు జ్యోతి, పద్మ, నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

డొంకరోడ్ల అభివృద్ధికి కృషి

మేడికొండూరు: సంవత్సరాల తరబడి మేజరు పంచాయతీ డోకిపర్రు గ్రామప్రజలు ఎదురుచూస్తున్న డోకిపర్రు-విశదల డొంక అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే సాధ్యమయిందని గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ నిధులు రూ.20లక్షలతో డోకిపర్రు - విశదలడొంక గ్రావెల్‌రోడ్డు అభివృద్ధి, అదేమార్గంలో కొండవీటివాగుపై కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ గతంలో ఎన్ని ప్రభుత్వాల మారినా డోకిపర్రు డొంక అభివృద్ధి అందని ద్రాక్షాగానే ఉందని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా స్థానికంగా ఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారదిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ తాను అమలు చేస్తున్న పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, గ్రామ సర్పంచ్ కొండెపోగు సాంబ్రాజ్యం, ఎంపీటీసీ నోసిన రామకోటమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, పాములపాటి వీరయ్య, ఆవుల సంజీవరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, ఉడతా ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దోకిపర్రు డొంక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హెనీ క్రిస్టినా, కత్తెర సురేష్ కుమార్

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలిలో గంజాయి విక్రయిస్తున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గంజాయి విక్రయిస్తున్న వారి వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు తెలియజేశారు. తెనాలి మండలం కొలకలూరుకు చెందిన అయిలా శ్రీనివాస్, ఐతానగర్‌కు చెందిన గుంజి లూర్దురాజు పాత నేరస్తులు. గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరికి గాంధీనగర్‌కు చెందిన బత్తిన అజయ్ కుమార్, బీసీ కాలనీకి చెందిన కూతాడి గోపి పరిచయం కాగా అంతా కలిసి జల్సాలు చేస్తూ, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. తేలికగా డబ్బు సంపాదించేందుకు కొంత కాలంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి వీరు తాగడంతో పాటు మిగిలినది చిన్న చిన్న పొట్లాలుగా చేసి అమ్మడం మొదలు పెట్టారు. వీరి అక్రమ వ్యాపారంపై సమాచారంతో నిఘా ఉంచిన టూ టౌన్ పోలీసులు ఐతానగర్‌లోని క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద గంజాయి పొట్లాలు కడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద రూ.16 వేల విలువ చేసే 1600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు జరిపినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్ఐలు రమేష్‌బాబు, నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

తెనాలిఅర్బన్: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సూచించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి శనివారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల పలు వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, ఎస్‌సీసీ అధికారి స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఎమ్మెల్యే ఆర్కే విస్తృత పర్యటన

పలు అభివృద్ధి పనుల పరిశీలన

మంగళగిరి: నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలోని ఇందిరానగర్‌లో రూ.1.05 కోట్లతో నిర్మించతలపెట్టిన యాదవ కమ్యూనిటీ హాల్ స్థల పరిశీలన చేశారు. కార్పొరేషన్ పరిధిలోని నవులూరు పశువైద్యశాల సమీపంలో జరుగుతున్న బీటీ, సీసీ రహదారుల నిర్మాణాలను పరిశీలించి నాణ్యత లోపించకుండా నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు రోడ్ల నిర్మాణాల వల్ల స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాలను కూల్చివేసేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో అన్ని రోడ్లను నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. అనంతరం యర్రబాలెంలో రూ.45లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను, బసవతారక నగర్‌లో రూ.1.05 కోట్లతో పూర్తి చేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయా రహదారుల ముఖ ద్వారాల వద్ద ఏర్పాటు చేయనున్న ఆర్చిలను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ముస్లిం వాటికలో సుమారు రూ.30లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. నగర పరిధిలోని గుంటూరు చానల్ వద్దగల తాగునీటి పథకానికి నూతనంగా ఏర్పాటు చేసిన మోటార్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించి ట్రయల్ రన్ నిర్వహించారు. నిర్ణీత సమయాల్లో ఉదయం, సాయంత్రం తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఆవరణలో జరుగుతున్న స్కేటింగ్ రింక్, స్విమ్మింగ్‌పూల్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యాదవ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

మంగళగిరి: ఆడపిల్లలపై జరుగుతున్న లైగింక వేధింపులు, దాడులు, బాల్య వివాహాలను అరికట్టాలంటే గ్రామాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు అవసరమని కో-ఆర్డినేటర్ కె.అనూష తెలిపారు. మండలంలోని కురగల్లులో శనివారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షురాలిగా స్నేహలత, మహిళా పోలీస్ కార్యదర్శిగా లక్ష్మిలతో పాటు పలువురి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మంగళగిరి కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నేలటూరి నాగమణి, బి.విజయలక్ష్మి, బి.అనిల్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైలు పరిశీలన

తెనాలి రూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత శనివారం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరాతీశారు.ఆహారం, తాగునీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు. తాగునీరు, ఫాగింగ్ విషయమై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.